క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



రసూల్‌పురా: పికెట్ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులకు సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం ఎస్ఐ శ్రీకాంత్.. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని, ఆర్థిక మోసం, క్యూఆర్ కోడ్ మోసాలు, ఓటీపీ, ఉద్యోగ, పెట్టుబడి, రుణ మోసాలు, వివాహ, హ్యాకింగ్, హనీ ట్రాపింగ్ వంటి వివిధ రకాల సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో సురక్షితంగా ఎలా ఉండాలో చిట్కాలు వివరించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్. నిషాంత్, ఈ. సింధు, బీ శ్రీనివాసులు, పాఠశాల ప్రిన్సిపాల్ రూపిందర్ సింగ్, ఉపాధ్యాయులు అనూరాగ్ సింగ్, రంగస్వామి, సుందర్ రాజ్, ప్రీతి పాండే, తస్నీమ్ బేగం, ప్రియాంక పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఆగస్టు 1న తలపెట్టిన 'హలో బీసీ విద్యార్థి–చలో ఢిల్లీ' పోస్టర్‌ను బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మబోయిన సైదులుయాదవ్ ఆధ్వర్యంలో ఓయూలో సోమవారం ఆవిష్కరించారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ డా.అవ్వారు వేణుకుమార్, ఓయూ ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు హాజరై మాట్లాడుతూ.. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌పీ నేత బారీ అశోక్‌యాదవ్, వీజేఎస్ ఓయూ అధ్యక్షుడు రమేశ్, బీసీఎస్ఎఫ్ నేత గణేశ్, సురేశ్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



అడ్డగుట్ట: సికింద్రాబాద్ డివిజన్ ఎల్ఐసీ ఆధ్వర్యంలో సౌత్ సెంట్రల్ జోనల్ అథ్లెటిక్స్ అండ్ వాలీబాల్ సెలక్షన్ ట్రయల్స్–2025 పోటీలు సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ గ్రౌండ్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా సౌత్ సెంట్రల్ జోన్ మేనేజర్ పునీత్ కుమార్ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ..సోమ, మంగళవారాల్లోనూ పోటీలు జరుగుతాయని విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజినల్ మేనేజర్ మధుసూదన్, మేనేజర్ శాంతి ప్రియ, ఉమాదేవి, చంద్రశేఖర్, స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు మెంబర్స్ సురేశ్, శర్మ పాల్గొన్నారు.

బోనాలకు ఏర్పాట్లు చేయండి

బన్సీలాల్‌పేట్: డివిజన్‌లో ఆగస్టు 10, 11 తేదీల్లో జరిగే అమ్మవారి బోనాల వేడుకలకు ఏర్పాట్లు చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈమేరకు వెంకటేషన్‌రాజు, సురేశ్, ప్రేమ్ తదితరులు జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను సోమవారం కలిసి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రాసిన లెటర్‌ను అందజేశారు. ఆలయాల పరిసర ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, వీధిదీపాల ఏర్పాటు, పరిశుభ్రత తదితర ఏర్పాట్లు చేసేలా ఆయా విభాగాల అధికారులను ఆదేశించాలని కోరారు.

బీసీ అభ్యర్థికి అవకాశం ఇవ్వండి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ప్రధాన రాజకీయ పార్టీలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీసీ నేతలకు అవకాశం ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు అన్ని రాజకీయ పార్టీలు తమను మోసం చేశాయని ఇంకా రాజకీయ అవకాశాలు కల్పించకుంటే పార్టీలు కనుమరుగు అవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు గొడుగు మహేశ్‌యాదవ్, పాలకూరి కిరణ్, సాయి, అనంతుల మహేశ్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



నాగ స్వరూప

బౌద్ధనగర్: మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళ అదృశ్యమైన ఘటన వారాసీగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వారాసీగూడ యూనైటెడ్ పీపుల్ చర్చి ప్రాంతంలో నివాసం ఉండే నాగస్వరూప (45)కు కొద్ది రోజులుగా మతిస్థిమితం సరిగా ఉండడం లేదు. సోమవారం ఉదయం 10.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో భర్త ముత్యాలు వారాసీగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు పీఎస్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

వామ్మో.. ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్..!

- శిథిలావస్థకు చేరిన గృహ సముదాయాలు
- కనీస సౌకర్యాలు లేక నివాసితుల ఇబ్బందులు
- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- ఇతర ప్రాంతాలకు తరలుతున్న ఉద్యోగులు



నిరుపయోగంగా ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్

సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్‌పాటిగడ్డలోని ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్ అధ్వానంగా మారాయి. ఇందులో చాలావరకు శిథిలావస్థకు చేరుకోగా, ఉన్న వాటిలోనూ కనీస సౌకర్యాలు లేక చాలామంది ఉద్యోగులు తమకు కేటాయించిన క్వార్టర్స్‌ను వదిలి ఇతరప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో క్వార్టర్స్ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి.

ఐదు దశాబ్దాల క్రితం నిర్మాణం..

వివిధ డిపార్టుమెంట్లలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగుల ఆవాసం కోసం 50 ఏళ్ల క్రితం బేగంపేట్ పాటిగడ్డలో అప్పటి ప్రభుత్వం ప్రత్యేకంగా మొదటి విడతలో 252, రెండో విడతలో మరో 252 క్వార్టర్స్‌ను అధికారుల కేటగిరీల వారీగా ఏ, బీ, సీ, డీ టైపు మేర నిర్మించారు. ఐఏఎస్ స్థాయి అధికారులకు ఏ టైపు క్వార్టర్స్, తర్వాత స్థాయిలను బట్టి బీ, సీ, డీ టైపు క్వార్టర్స్‌ను సచివాలయం నుంచి వచ్చే ఆర్డర్స్ మేరకు ఉద్యోగులకు కేటాయింపు చేస్తూ వచ్చారు. వారి వేతనాలను బట్టి హెచ్ఆర్ఏ కోత విధిస్తారు. ఆర్‌అండ్‌బీకి చెందిన స్థలంలో నిర్మాణాలు చేపట్టిన నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్‌గానే పిలుస్తూ వచ్చారు. వీటి నిర్వహణ కూడా ఆర్‌అండ్‌బీకే అప్పగించారు. అయితే రానురాను క్వార్టర్స్ నిర్వహణ గాలికొదిలేశారు. క్వార్టర్స్‌కు సంబంధించి ఏదైనా పనులు చేయాలంటే ఉద్యోగులు ముందుగా అప్పీలు పెట్టుకుంటారు. ఆ మేరకు అంచనాలు తయారుచేసి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాల్సి ఉంది. కానీ అప్పీలు తాలుకూ పనులు ఎప్పుడు చేస్తారో కూడా అర్థం కానీ పరిస్థితి నెలకొంది. దీంతో గత్యంతరం లేక ఉద్యోగులే పనులు చేయించుకుంటున్నారు.

ఖాళీగా క్వార్టర్స్..

నిర్వహణ సరిగా లేక భయానక పరిస్థితుల కారణంగా చాలామంది క్వార్టర్స్‌ను ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఇక కొత్తగా వచ్చే పరిస్థితి లేదు. ముఖ్యంగా పాత క్వార్టర్స్ స్లాబ్ పెచ్చులు కూడా ఊడిపోతుండడంతో ఎప్పుడూ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను అలాగే వదిలేయడంతో చెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. ఇదే అదునుగా పలువురు గంజాయి సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు 50 ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీ పైప్‌లైన్లే ఉండడంతో నివాసితులకు డ్రైనేజీ సమస్య ముప్పుతిప్పలు పెడుతోంది. సంజీవయ్య పార్కు ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ కూడా అందుబాటులో ఉండడంతో ఎంతో మంది ప్రయాణికులు ఈ క్వార్టర్స్ గుండా బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించే పరిస్థితి నెలకొన్నది.

కలెక్టరేట్ అన్నారు..ఊసే లేదు..

ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడం, ఉద్యోగులెవరూ ఉండకపోవడంతో వీటిని కూల్చేసి ఇక్కడ హైదరాబాద్ కలెక్టరేట్ నిర్మించాలనే ప్రతిపాదన చేశారు. ఈ మేరకు కొన్ని క్వార్టర్స్‌ను సైతం తొలగించారు. తర్వాత ఏమైందో తెలియదు కానీ కలెక్టరేట్ ప్రతిపాదన ముందుకు వెళ్లలేదు. కలెక్టరేట్ వస్తుందన్న వార్తలతో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం కాగా, కూల్చివేత పనులను అర్ధాంతరంగా నిలిపివేయడంతో ఆ ఆనందం ఎక్కువ రోజులు లేకుండా పోయింది. సంజీవయ్యపార్కు ఎంఎంటీఎస్ స్టేషన్ కూడా చెంతనే ఉండడంతో కలెక్టరేట్ వస్తే అందరికీ అందుబాటులో ఉన్నట్లవుతుందని అందరూ భావించారు.. కానీ ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా కలెక్టరేట్ భవనాల నిర్మాణానికి బ్రేక్ పడింది.

ముగిసిన బోనాల వేడుకలు

పద్మారావునగర్: పద్మారావునగర్ పరిసర ప్రాంతాల్లో సోమవారం అమ్మవారి బోనాల వేడుకలు ముగిశాయి. చివరిరోజు ఆలయాల వద్ద అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే డప్పుచప్పుళ్లు పోతరాజుల నృత్యాల మధ్య అమ్మవారి పలహారపు బండిని ఊరేగించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జీ పవన్‌కుమార్ గౌడ్, నగేశ్ ముదిరాజ్ తదితరులు హాజరై పూజలు నిర్వహించారు.

పద్మారావునగర్ పార్కులో..

వాకర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో పద్మారావునగర్ పార్కులోని అమ్మవారికి బోనం సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి బాల్‌రెడ్డి, కార్పొరేటర్ సామల హేమ, కరాటే రాజు, లాయక్, చక్రధర్ యాదవ్, కే నిరంజన్‌రావు, విజయ్, కే రాజు, సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు ఏసూరి మహేశ్, లక్ష్మీపతి, వెంకటేషన్‌రాజు, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



పలహార బండి ఊరేగింపులో పవన్‌కుమార్ గౌడ్, నగేశ్ ముదిరాజ్ తదితరులు



పూజల్లో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి

సీ సెక్షన్‌లో..

అడ్డగుట్ట: అడ్డగుట్టలోని సీ సెక్షన్‌లో ఫలహార బండ్ల ఊరేగింపు చేపట్టారు. మాజీ మేయర్, బీజేపీ నాయకురాలు బండ కార్తీకరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రారెడ్డి, వీరన్న, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మకు..

అమీర్‌పేట: అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎస్.శేషుకుమారి బీఆర్ఎస్ మహిళా నాయకులతో కలిసి బల్కంపేట ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. మహిళా నాయకులు లక్ష్మి, లలిత, రాణికౌర్ తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌పేట ప్రభుత్వాసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స చేసిన వైద్య బృందం

అమీర్‌పేట: అమీర్‌పేట ప్రభుత్వాసుపత్రి వైద్యులు ప్రమాదకరమైన స్థితిలో ఉన్న గర్భిణికి సకాలంలో శస్త్రచికిత్స చేసి పురుడు పోశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రౌఫ్ వివరాలు వెల్లడించారు. ఖైరతాబాద్ జవహార్‌నగర్‌కు చెందిన పిట్ట జ్యోతి (23) గర్భిణి. సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో తీవ్రమైన కడుపునొప్పి, అధికంగా అమ్నియోటిక్ ద్రవం కారడం వంటి సమస్యతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు గర్భాశయం చీలిపోయి ఉండవచ్చని భావించి వెంటనే ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు. శస్త్ర చికిత్స చేస్తుండగా గర్భాశయం పూర్తిగా పగిలి ఉండంతో పాటు శిశువు చేయి తల్లి పొత్తి కడుపులోకి జారిపోయింది. వైద్య బృందం సమన్వయంతో శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసి పురుడు పోశారని తెలిపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు. శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్యులు సబిత, నిలోహిత, రామప్రియ, నాగవీణ, అనస్థీషియా వైద్యులు లత, ఐశ్వర్య, రమ్య, శిశు వైద్యులు నాగరాజు, మహేశ్, హెడ్ నర్సు సుమిత్ర, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది మాధవి, రాజేశ్‌ను సూపరింటెండెంట్ రౌఫ్, ఆర్ఎంఓ వినాయరావు అభినందించారు.

వ్యక్తి అదృశ్యం

గాంధీఆస్పత్రి : గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను చేసేందుకు వచ్చిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా అర్షపల్లి గ్రామానికి చెందిన భాగ్య, పురుషోత్తం భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు. 3 నెలల క్రితం పురుషోత్తం ఇంట్లో చెప్పకుండా హైదరాబాద్‌కు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. ఈ విషయం అర్షపల్లిలో ఉంటున్న భార్యకు సమాచారం ఇచ్చాడు. 4 రోజుల క్రితం స్వగ్రామానికి వస్తున్నానని చెప్పాడు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు వెళ్లి అక్కడి నుంచి అదృశ్యమయ్యాడు. నగరంలోని బంధువుల ఇంట్లో వాకబు చేయగా నిజామాబాద్ వెళ్లినట్లు చెప్పారు. ఇంటికి కూడా రాకపోవడంతో భార్య నిజామాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి చిలకలగూడ ఠాణాకు రెఫర్ చేశారు. కేసు దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

'మోండా'లో సమస్యలు పరిష్కరించండి



కంటోన్మెంట్: మోండా డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ కోరారు. ఈమేరకు జీహెచ్ఎంసీ కార్యాలయంలో కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను సోమవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రసూల్‌పురా నారాయణ జోపిడి డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయానికి ప్రహరీ నిర్మించాలని క్షేత్ర స్థాయి పర్యటనకు రావాలని కోరారు. వచ్చే నెల 6న మోండా డివిజన్‌లో పర్యటిస్తానని కమిషనర్ పేర్కొనట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఎమ్మెల్యే పూజలు



రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లోని గండిమైసమ్మ ఆలయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బాబురావు ముదిరాజ్, అల్లాడి గౌరిశంకర్ నాయకులు నందికంటి రవి, కే శ్రీనివాస్ తదితరులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అలాగే ఆషాఢమాసంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన ఒడి బియ్యంతో అన్నదానం నిర్వహించారు.

బహుజన విద్యార్థులకు అవకాశాలు కల్పించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో బహుజన విద్యార్థులకు అవకాశాలు కల్పించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీలో బీఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యా రంగ సమస్యలపై చర్చించారు.

బీఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం

ఓయూలో బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా శార్థాని రాము, ఉపాధ్యక్షుడిగా ప్రేమానంద్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ కోఆర్డినేటర్ కరుణాకర్ బహుజన్, స్టేట్ జనరల్ సెక్రటరీ దాసరి రాజశేఖర్, చిలుముల అజయ్, గ్రేటర్ అధ్యక్షుడు సాప కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అమీర్‌పేట: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వెస్ట్‌బెంగాల్‌లోని ఐపూర్‌కు చెందిన రజిత్ ఓరన్ (27) అమీర్‌పేట మైత్రీవనం రోడ్డులో ఉన్న ఆదిత్య టవర్స్ మొదటి అంతస్తులోని సెగ్మెంట్ ఫేసెస్ కార్యాలయంలో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. సంస్థ ద్వారా భవనాలను అద్దెకు తీసుకుని ఆఫీస్‌లుగా మార్చి అద్దెలకు ఇస్తుంటారు. రజిత్ కార్యాలయ ఆవరణలోనే ఉన్న ఓ గదిలో నివాసముంటున్నాడు. సోమవారం ఉదయం ఆఫీసుకు వచ్చిన సెక్యూరిటీ ఇన్‌చార్జి నాగేశ్వర్‌రావు రజిత్ ఉండే గది తలుపులు ఎంత సేపు తట్టిన తీయలేదు. అనుమానం వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా రజిత్ ఉరేసుకుని కనిపించాడు. అప్పటికే మృతి చెందినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని అనుమానిస్తున్నారు. రజిత్‌కు వివాహం అయినప్పటికీ భార్య సొంత గ్రామంలో ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓయూలో జైపాల్ రెడ్డి వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: మాజీ కేంద్ర మంత్రి, జైపాల్ రెడ్డి వర్ధంతిని ఓయూలో సోమవారం విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట కాంగ్రెస్ నాయకుడు వలిగొండ నరసింహ జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నందు, అనర్స్, మహిపాల్, మహేశ్, విష్ణు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఆలయంలో వన మహోత్సవం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ గణపతి ఆలయంలో సోమవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ రామకృష్ణ, ధర్మకర్తల మండలి చైర్మన్ పర్ష ప్రభాకర్, సభ్యులు కలిసి మొక్కలు నాటారు. అనంతరం దేవాలయంలో హోం కర్రల సరఫరా, చీరల, దోతుల సేకరించడం, వివిధ ఉత్సవాల్లో పువ్వుల అలంకరణ తదితర వాటికి టెండర్లు నిర్వహించారు.

చెట్ల కొమ్మల తొలగింపు

లాలాపేట: లాలాపేట సత్యానగర్, ఇందిరానగర్‌లో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగులుతూ తరచుగా సమస్యలు తలెత్తడంతో పాటు వీధిలైట్లు అడ్డుగా ఉన్నాయి. ఈ విషయమై స్థానికులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు, సిబ్బంది సోమవారం విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు.

పారిశుధ్య కార్మికులకు కిట్ల పంపిణీ

సనత్‌నగర్: జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఎస్.జయంత్, ఖైరతాబాద్ సర్కిల్ ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి ఆ కాలనీలో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికులకు సోమవారం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌చందు, ప్రతినిధులు శివారెడ్డి, సోమ వెంకట్, బిల్డర్ రాజా, సీహెచ్.అనంతరెడ్డి, ఏవీకే విశ్వనాథరాజు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఓఎస్‌డీ వేణుగోపాల్, సునీల్, రామకృష్ణ, రవి, రామసుబ్బారెడ్డి, నాగిరెడ్డి, శశికళ, ప్రసాదరాజు, బాల, విజయ్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ

అడ్డగుట్ట: హైదరాబాద్ జిల్లా బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో షేక్‌పేట్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో అడ్డగుట్టకు చెందిన అభినవ్, ఆకాంక్ష సత్తా చాటారు. ఫోర్త్ అండర్–15 సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ పోటీల్లో అభినవ్, ఆకాంక్ష ప్రతిభ చూపి గోల్డ్ మెడల్స్ సాధించారు. తుకారాంగేట్‌లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్‌ను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా శ్రీ గణేశ్ వారిని అభినందించారు.



అభినవ్, ఆకాంక్షను అభినందిస్తున్న ఎమ్మెల్యే

యువతకు శిక్షణ.. ఉపాధికి బంగారు బాట

- హెల్త్‌కేర్ రంగంలో తర్ఫీదు
- శిక్షణ తర్వాత ఉద్యోగాలు లభించేలా సహకారం
- మూడు సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో..
- నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు



సీపీఆర్‌లో శిక్షణ

రాంగోపాల్‌పేట్: డిగ్రీలు పూర్తి చేసినా ఎంతో మంది యువతకు నైపుణ్యాలు లేక..చదివిన చదువుకు సరైన ఉద్యోగాలు దొరక్క నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. మరికొంత మంది ఏదో ఒకటి అంటూ దొరికిన ఉద్యోగంతో తృప్తిపడి అరకొర వేతనాలతో జీవితాలను కొనసాగిస్తున్నారు. అయితే నిరుద్యోగ యువతలోని నైపుణ్యాలకు మరింత పదును పెట్టేలా శిక్షణ ఇచ్చి..వారికి ఉపాధి మార్గం చూపి..బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నాయి కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్, బొల్లినేని మెడిస్కిల్స్, టెక్ మహీంద్ర స్వచ్ఛంద సంస్థలు.

❖ విస్తృతమైన అవకాశాలు ఉన్న హెల్త్ కేర్ రంగంలో నిరుద్యోగులకు హెల్త్‌కేర్ బిల్లింగ్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ అందిస్తూ వారికి తోడ్పాటునందిస్తున్నారు.

❖ 2016 నుంచి దాదాపు 12 వేల మంది నిరుద్యోగులను తీర్చిదిద్ది వారి జీవితాలకు కొత్త బాటను చూపించారు. ఇక్కడ శిక్షణ పొందిన యువత హైదరాబాద్‌తో పాటు బెంగుళూరు తదితర నగరాల్లో కూడా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు పొందారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ ప్రాంతంలోని పాత సన్‌షైన్ భవనంలో శిక్షణ యజ్ఞం కొనసాగుతోంది.

మూడు నెలల శిక్షణ..ఉచిత వసతి

❖ డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు హెల్త్‌కేర్ బిల్లింగ్‌లో, పదవ తరగతి, ఇంటర్ పూర్తి చేసిన వారికి జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్ అసిస్టెంట్)గా మూడు నెలల శిక్షణ అందిస్తారు. ఆస్పత్రుల్లో బిల్లింగ్ ఎలా చేయాలి అనే దానిపై డమ్మీ సాఫ్ట్‌వేర్‌పై ప్రాక్టికల్‌గా శిక్షణ అందిస్తారు.

అలాగే కంప్యూటర్ టైపింగ్, ఎంఎస్ ఆఫీస్, కమ్యూనికేషన్స్, సాఫ్ట్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్ లలో శిక్షణ అందిస్తారు. జీడీఏ కోర్సులో పేషెంట్ కేర్, బీపీ, షుగర్, పల్స్, ఓరల్ కేర్ తదితర వాటిలో పాఠ్యాంశాలతో పాటు ఆస్పత్రిలో ప్రాక్టికల్‌గా శిక్షణ అందిస్తారు.



కంప్యూటర్ బిల్లింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న యువత


❖ బిల్లింగ్ కోర్సు చేసిన వారికి రూ.20 నుంచి 25 వేల వరకు జీతం అందుతుండగా..జీడీఏ చేసిన వారికి మొట్ట మొదటి జీతం రూ.15 వేల నుంచి తీసుకుంటున్నారు. ఇలా పేద, మధ్య తరగతి యువతకు ఈ ఎన్‌జీవోలు అందిస్తున్న ఉచిత శిక్షణ వారి జీవితాలను నిలబెడుతున్నాయి.

❖ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే యువతీ, యువకులకు ప్రాధాన్యం ఇస్తూ వారికి ఉండేందుకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ఈ కోర్సుల్లో శిక్షణ తీసుకునేందుకు ప్రవేశానికి 18 నుంచి 27 ఏళ్ల మధ్యలో వయసు ఉండే వారు అర్హులు.

❖ తమ సంస్థల ద్వారా కోటి కుటుంబాలకు మేలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు వెల్లడించారు.

❖ పేద, మధ్య తరగతికి చెందిన లక్ష మంది నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి కల్పిస్తే కోటి కుటుంబాలకు మేలు చేసినట్లు అవుతుందనేది తమ సీఎండీ బొల్లినేని భాస్కర్‌రావు ఉద్దేశమన్నారు. ముఖ్యంగా యువతులకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

ఒడిశా నుంచి వచ్చా



ఒడిశాలో డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉన్న నాకు నగరంలో సెక్యూరిటీ గార్డుగా చేసే నాన్న ద్వారా ఈ శిక్షణ గురించి తెలిసింది. దీంతో ఇక్కడ హెల్త్‌కేర్ బిల్లింగ్‌లో శిక్షణ తీసుకున్నా. రూ.25 వేల జీతంతో బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం దొరికింది. నా కుటుంబానికి బాసటగా ఉండేందుకు ఎంతో ఉపయోగపడింది. చాలా సంతోషంగా ఉంది.

– శివాని, శిక్షణ పొందిన యువతి

జీవితం చాలా మారింది



డిగ్రీ పూర్తి చేసి ఎక్కడ జాబ్‌కు వెళ్లినా రూ.10 నుంచి15 వేల కంటే ఎక్కడ ఎక్కువ ఇవ్వమన్నారు. ఇక్కడ శిక్షణ తీసుకోగానే వెంటనే బెంగుళూరులో రూ.25 వేల జీతంతో ఉద్యోగం దొరికింది. దీంతో కుటుంబాన్ని పోషించడంతో పాటు నా జీవితం చాలా మారింది.

– ప్రియాంక, శిక్షణ పొందిన యువతి